ఓట్ల లెక్కింపు, భద్రతను పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ఓట్ల లెక్కింపును పరిశీలించిన సీపీ

రామగిరి, జూన్ 4: రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ జేఎన్‌టీయూలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల కేంద్ర పోలీస్ సాయుధ బలగాలతో భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మరణించినా.. మరో ఇద్దరికి చూపును ప్రసాదించి

- కిడ్నీ సమస్యతో సింగరేణి ఉద్యోగి మృతి
- నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు

కోల్‌సిటీ, జూన్ 4: తాను మరణించినా అతని కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తున్నాయి. మరో ఇద్దరు అంధుల జీవితాలకు వెలుగును ప్రసాదించాయి. గోదావరిఖని సాయినగర్‌లో బూడిద రాజయ్య (55) సింగరేణి ఆర్జీ-3 పరిధి ఓసీపీ-1లో మెకానికల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రాజయ్య మంగళవారం సింగరేణి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజయ్య నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన వారవుతారని సదాశయ ఫౌండేషన్ సభ్యులు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. స్పందించిన వారు రాజయ్య నేత్రాలను దానం చేయడానికి అంగీకరించగా ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ సతీశ్ ద్వారా నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఇంటి పెద్ద చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా సమాజ హితం కోసం ఆలోచించి నేత్రదానం చేసిన మృతుడి భార్య రాజేశ్వరి, కూతురు-అల్లుడు ప్రియాంక, అనిల్‌కుమార్ ముందుకు వచ్చినందుకు ఫౌండేషన్ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, లింగమూర్తి, నూక రమేశ్, కేఎస్ వాసు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్డి కవిత అనంత రాములు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ అభినందించారు. రాజయ్య మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

మాజీ కార్పొరేటర్ మృతి

లింగయ్య(ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 4: పట్టణంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ దొంతుల లింగయ్య కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొం దుతూ మంగళవారం మృతిచెందారు. కొన్ని రోజులు టగా అనారోగ్యం బారిన పడిన లింగయ్య దవాఖానలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తర లించగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాగూర్ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్,జూన్ 4: మండలంలోని మల్యాల లో పతే హైమద్ ఇటీవల మృతి చెందగా, అతడి కుమారుడు రజాక్‌కు తోటి స్నేహితులు అండగా నిలిచారు. రజాక్ తో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.12వేల నగదు అందజేసి అండగా నిలిచారు. ఇక్కడ బసవత్తుల జ్ఞానేంద్రచారి, ఆరెల్లి శ్రీనివాస్, అం బాల కుమార్, పిన్నింటి విష్ణువర్ధన్ న్‌రెడ్డి, పంజాల సురేశ్, మునేశ్, తరుణ్, రాజేందర్, కుమారస్వామి, మారం దేవేందర్‌రెడ్డి, బొల్లి సురేశ్, మనోజ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-AII
CHANGE OF NAME
★I SUDHEER KUMAR.M s/o: MEKALA ODELU, R/o: H.No. 1-85/1, Potharam Village, Mutharam Manthani mandal, Peddapalli dist, Telangana state, corrected as my father name MEKALA ODELU @ ODELU MEKALA in place of ODELU, for all purpose.
NTK-0000
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

జిల్లా జైలును సందర్శించిన ప్రధాన న్యాయమూర్తి

రాంనగర్, జూన్ 4: కరీంనగర్ జిల్లా జైలును మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమా సందర్శించారు. జైలులో ఖైదీల యోగక్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత జైలులో క్యాంటీన్, జైలు హస్పిటల్, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్లు శుభ్రత, వంటశాల, జైలు ఇండస్ట్రీ నిర్వహణపై అధికారులను అభినందించారు. ఖైదీలతో మాట్లాడుతూ, ఎంతో మంది క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు వస్తున్నారని, జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత కొత్త జీవితం ప్రారంభించి సరైన మార్గంలో నడవాలని సూచించారు. మహిళా జైలును కూడా సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మహిళా ఖైదీలతో మాట్లాడారు. వారి కేసు వివరాలు, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. జైలులో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేట్ లాయర్‌ను పెట్టుకునే స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేశ్, పర్యవేక్షణ అధికారి కే శ్రీనివాసు, వైద్యాధికారి కే వేణుగోపాల్, జైలర్ శ్రీనివాస్, రమేశ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంగీత, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తణుకు మహేశ్, గార్డింగ్ సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

ఎన్నికలు పూర్తైనా గుర్తింపు ఏది?

- కార్మిక శాఖ ఇవ్వడం లేదా? గుర్తింపు సంఘం తీసుకోవడం లేదా?
- సింగరేణిలోన గెలిచినా పగ్గాలు చేపట్టని అధికారిక సంఘం
- కాలపరిమితి పెంపుకోసమే కొత్త డ్రామాలని విమర్శలు
- ఐదు నెలలుగా జరగని స్ట్రక్చర్ సమావేశాలు
- ఎక్కడికక్కడే తిష్టవేసిన సమస్యలు
- కార్మికుల్లో అయోమయం

పెద్దపల్లి, జూన్ 4(నమస్తే తెలంగాణ): మినీ అసెంబ్లీని తలపించే విధంగా జరిగిన సింగరేణి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలు పూర్తై ఫలితాలు ప్రకటించినా ఇంకా గుర్తింపు సంఘానికి గుర్తింపు దక్క లేదు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న బొగ్గు గనులను వెలికి తీసేందుకు సింగరేణి సంస్థ భూగర్భ, ఓపెన్ కాస్టు గనులను నిర్వహిస్తున్నది. 11 ఏరియాలుగా విస్తరించి ఉన్న సింగరేణి ప్రాంతాల్లో 39,773 మంది కార్మికులు గుర్తింపు సంఘం ఎన్నికల్లో పాల్గొనేందుకు ఓటు హక్కును సాధించారు. 1998 నుంచి ఎన్నికలను నిర్వహించి, గెలుపొందిన సంఘాన్ని గుర్తింపు సంఘంగా పరిగణలోకి తీసుకొని కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణి సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ క్రమంలో ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా ఏడు సార్లు ఎన్నికలను నిర్వహించింది. గుర్తింపు సంఘానికి రెండేళ్ల కాల పరిమితితో ఎన్నికలను నిర్వహించగా మూడుసార్లు మాత్రం సెంట్రల్ లేబర్ కమిషన్, సింగరేణి సంస్థ నాలుగు సంవత్సరాల కాల పరిమితిని ఇచ్చింది. తాజాగా, గతేడాది 2023 డిసెంబర్ 27న నిర్వహించిన ఎన్నికల్లో 11 ఏరియాలకు 6 ఏరియాల్లో సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ విజయం సాధించగా మరో 5 స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. దీంతో గుర్తింపు సంఘం హోదాను సీపీఐ అనుబంధ ఏఐటీయూసీకి దక్కగా ఐఎన్‌టీయూసీ ప్రాతినిథ్య సంఘంగా నిలిచింది. ఎన్నికలు పూర్తై 5 నెలలు దగ్గరికి వస్తున్నా ఇప్పటి వరకు ఆ సంఘం సెంట్రల్ లేబర్ కమిషన్ నుంచి గుర్తింపు పత్రాన్ని అందుకోలేదు. దీంతో సింగరేణి వ్యాప్తంగా సర్వ త్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు పూర్తై ఫలితాలను ప్రకటించిన నాటి నుంచి అన్ని సభలు, సమావేశాలకు అధికారిక గుర్తింపు యూనియన్‌గా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు హాజరవుతున్నా గుర్తింపు పత్రాన్ని మాత్రం అందుకోకపోవడం పట్ల కార్మికులు విస్మయం చెందుతున్నారు.

నాలుగేండ్ల గుర్తింపు హోదా కోసమే కాలయాపనా?

తెలంగాణలో ప్రభుత్వం మారిన వెంటనే సింగరేణిలోని అనేక సమస్యలు, విధి విధానాలపై ఎన్నో హామీలు ఇచ్చి కార్మికులను తమవైపు తిప్పుకున్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు కార్మికుల నమ్మకాలను వమ్ము చేస్తున్నాయి. సింగరేణి గుర్తింపు సంఘంగా నాలుగేళ్ల గుర్తింపు హోదాను దక్కించుకునేందుకే ఏఐటీయూసీ గుర్తింపు పత్రం అందుకోవడం లేదని, దీని కోసం సెంట్రల్ లేబర్ కమిషన్ వద్ద, సింగరేణి యాజమాన్యం వద్ద ఒత్తిడి చేస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో 11 ఏరియాల్లో మొత్తం 39,773 మంది కార్మికులు ఓటు హక్కును కలిగి ఉండగా 37, 447 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 13 కార్మిక సంఘాలు ఈ ఎన్నికల్లో పోటీ పడగా బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం-1, 2, 3 ప్రాంతాల్లో ఏఐటీయూసీ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. సింగరేణి వ్యాప్తంగా 16,177 ఓట్లతో ఏఐటీయూసికి గుర్తింపు సంఘంగా ఎన్నిక కాగా ఇల్లెందు, మణుగూరు, కార్పొరేట్‌లో ఏఐటీయూసీ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. రెండేళ్ల పదవీ కాలానికే ఎన్నిక జరిగినా.. నాలుగేళ్ల పదవీ కాలంగా గుర్తింపు పత్రం ఇవ్వాలని పట్టుబడుతోంది. దీంతో సెంట్రల్ లేబర్ కమిషన్ మాత్రం ఎన్నిక నిర్వహణ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని, పదవీ కాలమనేది సింగరేణి యాజమాన్యమే నిర్ణయించాలని వెల్లడించింది. సింగరేణి యాజమాన్యం 51 శాతం వాటాతో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పని చేస్తుండడంతో నాలుగేళ్ల పదవీ కాలంతో అధికారిక గుర్తింపును పొందాలని ఆరాట పడుతున్నది. సీఎల్‌సీఏ తమకు గుర్తింపు పత్రం ఇవ్వడం లేదంటూ కొత్త డ్రామాలను తెరపైకి తెచ్చి కాలయాపన చేస్తున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఐదు నెలలుగా అటకెక్కిన సమస్యలు

సింగరేణి ఎన్నికలు జరిగి ఐదు నెలలలైనా గుర్తింపు సంఘంగా గుర్తింపును తీసుకోకుండా కేవలం ప్రారంభోత్సవాలు, సమావేశాలు, సభలకు మాత్రమే ఏఐటీయూసీ నాయకులు హాజరవుతుండడంపై సింగరేణి కార్మికులు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. ఐదు నెలల్లో గుర్తింపు పత్రం లేక స్ట్రక్చర్ సమావేశాలు పూర్తిగా నిలిచిపోయాయి. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గెలిచిన సంఘాలతో యాజమాన్యం ప్రతి నెలా జీఎం స్థాయిలో, మూడు నెలలకు ఒకసారి డైరెక్టర్, కార్పొరేట్ స్థాయిలో నిర్ణయాత్మక(స్ట్రక్చర్) సమావేశాలు నిర్వహిస్తారు. ప్రాతినిధ్య సంఘంగా ఉన్న ఏఐటీయూసీ సైతం వీటి పైన మిన్నకుండి పోయింది. అధికారిక గుర్తింపు పత్రం లేనిదే యాజమాన్యంతో కార్మిక సంఘాలు స్ట్రక్చర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించడం సాధ్యం కాదు. అదే విధంగా మైన్, పిట్ స్థాయిలోనూ సేఫ్టీ, మైన్స్ కమిటీలు సైతం నిర్వహించడానికి సాధ్యం కాకపోవడంతో గెలుపు వల్ల లాభం ఏమిటని, ఓడిన సంఘాల మాదిరిగానే వినతి పత్రాలు ఇచ్చుకుంటూ పోతే ఏమి లాభమని పలువురు కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

గుర్తింపు తీసుకోకపోతే అన్ని సంఘాలను పిలవాలి

గతంలో సంస్థ పరిరక్షణ కోసం రాజకీయ జోక్యం వద్దంటూ కార్మిక సంఘాల ఎన్నికలను నిర్వహించాలని కోర్టుకు వెళ్లడంలో ఉన్న శ్రద్ధ ఇంకా గుర్తింపు పత్రం తీసుకోవడంలో ఏఐటీయూసీ ఎందుకు చూపడం లేదని, ఎందుకు పోరాటం చేయడం లేదని, గెలిచాక పోరాటం ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలని కార్మికులు కోరుతున్నారు. గుర్తింపు పత్రం తీసుకోకుండానే అధికారిక కార్యక్రమాలకు మాత్రం గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు అంటూ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వేదికలు వంచుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు పత్రాలు పొందకుండా కొత్త డ్రామాలు ఆడుతున్నాయని, సింగరేణి యాజమాన్యం గుర్తింపు పత్రం తీసుకోని పక్షంలో అన్ని సింగరేణి కార్యక్రమాలకు, అధికారిక కార్యక్రమాలకు అన్ని సంఘాలను పిలవాలని మిగతా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గుర్తింపు పత్రం ఎంత ఆలస్యమైతే అంత కాలం అధికంగా అధికారంలో కొనసాగవచ్చననే దురుద్దేశంతోనే గుర్తింపు పత్రం అలస్యమైనా ఫర్వాలేదనే భావనతోనే ఏఐటీయూసీ అగ్ర నాయకులు వ్యవహరిస్తున్నారనే అనుమానం కార్మికులలో నెలకొంది. ఇంకా యాజమాన్యం అధికారికంగా ఇవ్వనందున అన్ని యూనియన్లను గుర్తించాలని లేదా వెంటనే అధికారికంగా గుర్తింపు పత్రమైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి.

సమస్యలతో సతమతమవుతున్న కార్మికులు

బొగ్గు గని కార్మికులకు ఆదాయపన్నుల్లో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాయితీలూ ఇవ్వకపోవడం మూలంగా ఇప్పటికీ సంవత్సర కాలంలో మూడు, నాలుగు నెలల జీతం ఐటీ రూపేనా కోతలకు పోతుందని కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. కోలిండియాలో అలవెన్సులపై ఐటీ మాఫీ చేసిన ఒప్పందాన్ని ఇప్పుడైనా గెలిచిన సంఘం యాజమాన్యంతో అధికారికంగా చర్చించి, అమలు చేయిస్తే కార్మికులకు కొంత మేరకు ఉపశమనం కలుగుతుందని కార్మికులు భావిస్తున్నారు. అదే విధంగా కార్మికుల సొంతింటి కల, మారు పేర్ల మార్పు, కారుణ్య నియామకాల్లో అవినీతి, కొత్త భూగర్భ గనుల కేటాయింపు, పలు కేడర్ స్కీములు, మార్పులు కోలిండియా ఒప్పందాల అమలు వంటి సమస్యల పరిష్కారంపై గుర్తింపు సంఘం చర్యలు చేపట్టాలని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

రాజకీయ వేదికలకు గెలిచిన సంఘాల నాయకుల పరిమితం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యాజమాన్యం, ప్రభుత్వం కలిసి నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలంటూ ఆ యూనియన్ల పెద్ద నాయకులు అదే రాజకీయ నాయకులతో కలిసి వేదికలు వంచుకుంటున్నారే తప్ప గుర్తింపు పత్రం తీసుకొని సమస్యలపై యాజమాన్యంతో చర్చించడంపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు పెట్టుకోవడం.. ఇందులో భాగంగా కొత్తగూడెం ఎమ్మెల్యేగా సీపీఐ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లోనూ పొత్తు పెట్టుకొని బరిలో నిలిచాయి.కానీ, సింగరేణి ఎన్నికలు జరిగి, విజయం సాధించిన సంఘాలు మాత్రం బాధ్యతలను మరిచి నాలుగేళ్ల గుర్తింపు కోసం పరితపిస్తున్నాయి తప్ప తమను పట్టించుకోవడం లేదని కార్మికులు విమర్శలు చేస్తున్నారు.

రామగుండం మేయర్ ఎక్కడ..?

- ఎప్పుడు వస్తాడో..ఎంతసేపు ఉంటాడో తెలియదు..
- బల్దియాలో చాంబర్ ఎప్పుడూ ఖాళీగానే
- సమస్యలు విన్నవించాలంటే రోజుల తరుబడి తిరగాల్సిందే.
- అన్ని శాఖల్లో కొరవడుతున్న సమయ పాలన

రామగుండం మేయర్ చాంబర్

కోల్‌సిటీ, జూన్ 4: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కొద్ది రోజులుగా మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ అందుబాటులో ఉండకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సారు రానే రాడు... అత్తే గూడ ఆగనే ఆగడు...' అంటూ పలువురు వ్యంగ్యాస్త్రాలు గుప్పిస్తున్నారు. గత శాసన సభ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు కనీసం రెండు రోజులకోసారైనా కార్యాలయానికి వచ్చి ప్రజలు, కార్పొరేటర్లు, సిబ్బందికి అందుబాటులో ఉండేవాడు. ఏవైనా సమస్యలుంటే పరిష్కరించే వీలు ఉండేదని, ఇప్పుడు అంతా రివర్స్‌గా మారిందని కార్యాలయానికి వచ్చిన పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం రాష్ట్రంలోని అన్ని మున్సిపల్, కార్పొరేషన్లలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో బిల్ కలెక్టర్లకు రశీదు పుస్తకాలు ఇవ్వకుండా వారి స్థానంలో వీఆర్‌ఏ, వార్డు ఆఫీసర్లకు విధులు అప్పగించింది. ఈ నేపథ్యంలో రామగుండం బల్దియాలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది మూడు రోజుల క్రితం మేయర్‌ను కలిసి మరోసారి విన్నవించుకుందామని వచ్చి దాదాపు 4 గంటలకు పైగా ఎదురు చూసినా ఆయన కలవకపోవడంతో నిరాశగా వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదేగాకుండా వివిధ సమస్యలపై విన్నవించేందుకు ప్రజలే కాదు... కార్పొరేటర్లు కూడా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన వస్తున్నది. నగర ప్రథమ పౌరుడే ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంపై రామగుండం కార్పొరేషన్‌లో ప్రజాపాలన అటకెక్కి కూర్చుందని, దీనితో వివిధ శాఖల్లో కూడా బాధ్యతారాహిత్యం ఆవహించి పలు అవకతవకలకు దారి తీస్తున్నదని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బల్దియా కార్యాలయంలో ఎలక్ట్రికల్ పనులకు సంబంధించి కూడా కొన్ని అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పలు గదుల్లో ఏసీల మరమ్మతుల పేరిట అధిక బిల్లులు రాసి అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొద్ది రోజులుగా కార్యాలయంలో మేయర్ అందుబాటులోకి రాకపోవడంతో వివిధ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది కూడా సమయపాలన పాటించడం మానేశారు. దీనితో ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది విధుల్లోకి రావడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వివిధ డివిజన్లలో ప్రజలకు జవాబుదారీగా ఉన్న కార్పొరేటర్లు ఆయా సమస్యలపై మేయర్‌ను కలిసేందుకు కార్యాలయాకి వచ్చి గంటల తరబడి హాలులో కూర్చొని నిరీక్షించాల్సి వస్తున్నది. అటు డివిజన్లలో ప్రజా సమస్యలు పేరుకుపోవడం, వివిధ కాలనీల్లో గ్యాస్ పైపులైను నిర్మాణం మూలంగా మిషన్ భగీరథ మంచి నీటి పైపులైను పగిలి రోజుల తరబడి సరఫరాకు అంతరాయం కలగడం, వివిధ అభివృద్ధి పనులకు ఆటంకం కలగడం ఇలా ఆయా సమస్యలపై తాము ఎవరికి చెప్పుకునేదంటూ కార్పొరేటర్లే కార్యాలయం సాక్షిగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరీ తప్పనిసరి పరిస్థితి అయితే మేయర్‌ను కలవాలంటే ఆయన పని చేసే దవాఖానకు వెళ్లి వినతి పత్రాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ సంబురాలు

విజయం సంకేతం చూపుతున్న గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు

మంథని/రామగిరి, జూన్ 4: పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ విజ యం సాధించగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం సంబురాలు నిర్వహిం చారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, విజయరమణారావు, మక్కాన్‌సింగ్ సంబురాల్లో పాల్గొన్నారు. రామగిరి మండలం బేగంపేటలో కాంగ్రెస్ నాయకులు వంశీకృష్ణను ఎత్తుకొని ఉత్సాహంగా కేరింతలు పెడుతూ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ ఇంటికి తీసుకెళ్లారు. విప్, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు వంశీకి శుభాకాంక్షలు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్/ఓదెల, జూన్ 4: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ గెలుపొందగా కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశా రు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు గాజనవేన సదయ్య, చదువు రాంచంద్రారెడ్డి, మాదాసి సతీశ్, అల్లం దేవేందర్, రానవేన శ్రీనివాస్, బంగారు రమేశ్, గీస రాజయ్య, సబ్బని రాజమల్లు, శివరామకృష్ణ, సురేశ్, మొం డయ్య, బోడకుంట చిన్నస్వామి అల్లం సతీశ్, శ్రీని వాస్ గౌడ్, తీర్థాల వీరన్న, గడిగొప్పుల సం తోష్ సతీశ్, రాజు, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు

ఓదెల, జూన్ 4: రాష్ట్రంలో 8 ఎంపీ స్థానాలు గెలవడం, దేశంలో మళ్లీ మోదీ ప్రధానమంత్రి అవుతుండడాన్ని హర్షిస్తూ కొలనూర్ గ్రామం లో బీజేపీ నాయకులు మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచాలు కాల్చి, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంగరి అనిల్‌యాదవ్, పుల్ల సదయ్యగౌడ్, రేగుల తిరుపతి, రజనీకర్‌రెడ్డి, కొలిపాక వెంకట్, బండారి శ్రీనివాస్, గీట్ల దినేశ్‌రెడ్డి, జక్కుల హరీశ్, జంగం రాజు పాల్గొన్నారు.

భారీ వర్షం

- ఉరుములు, మెరుపులతో జిల్లాలో వర్షం
- పలు చోట్ల భారీ వృక్షాలు నేలమట్టం
- ఖనిలో పిడుగుల మోత.. తప్పిన పెను ప్రమాదాలు

కోల్‌సిటీ : గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలో సింగరేణి క్వార్టర్‌పై కూలిన భారీ వృక్షం

ఓదెల: గోపరపల్లిలో కరంట్ వైర్ల పై పడిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ/జూలపల్లి/సుల్తానాబాద్ రూరల్/ఓదెల/జ్యోతినగర్, జూన్ 4: పెద్దపల్లి జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పిడుగుల మోత స్థానికులను భయాందోళనకు గురయ్యారు. దాదాపు గంటపాటు దద్దరిల్లే విధంగా పిడుగుల శబ్ధాలను నగర ప్రజలను కలవరపెట్టింది. గోదావరిఖనిలోని స్థానిక పవర్‌హౌస్ కాలనీలో సింగరేణి క్వార్టర్(టీ2-213)పై భారీ వృక్షం పడడంతో ఇల్లు ధ్వంసమైంది. రామగుండంలో పలు చోట్ల వృక్షాలు నేలవాలడంతో విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దాదాపు మూడు గంటలకు పైగా పారిశ్రామిక ప్రాంతం అంతటా విద్యుత్ అంతరాయం కలిగింది. అలాగే సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంటలో గాలిదుమారానికి బొజ్జ మధుకర్, తాండ్ర శ్రీనివాస్, బొల్లం నర్సమ్మ ఇండ్లపై చెట్లు విరిగి పడడంతో గోడలు, రేకులు నేలమట్టమయ్యాయి. దాదాపు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఒకొక్కరికి ఆస్తినష్టం సంభవించింది. ఓదెల మండలం గుండ్లపల్లిలో వెల్పుల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శంకర్‌రెడ్డి ఇండ్ల పైకప్పు రేకులు ఈదురుగాలుల ఉధృతికి కొట్టుకుపోయాయి. గోపరపల్లి, కొలనూర్, హరిపురం, పిట్టల ఎల్లయ్యపల్లె, కనగర్తి గ్రామాల్లో రోడ్ల వెంబడి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి రాత్రి వరకు కరెంట్ నిలిచిపోగా, విద్యుత్ అధికారులు పునరుద్ధరించారు. కొలనూర్‌లో కొంతసేపు రాళ్ల వాన పడింది. కాగా, జిల్లాలో ఒక్కసారి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతోపాటు భారీ వర్షం పడడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో సంబురంగా సాగుబాటుకు సమయాత్తం అవుతున్నారు. ఎన్టీపీసీ కాలనీలోని ఓదెల చంద్రమౌళికి చెందిన ఇంట్లోని మూడు గదుల రేకులు పూర్తిగా నేలమట్టం కాగా, ముప్పిడి రాజయ్య, ఓదెల రాయమల్లుకు చెందిన ఇంటి రేకులు విరిగిపోయాయి. రెండో డివిజన్‌లో ఓ ఇంటి ప్రహరీ కూలిపోయింది. రామగుండం పట్టణం ఆదర్శనగర్‌లో మాల మహానాడుకు చెందిన కమ్యూనిటీహాల్ రేకులు గాలిలోకి విరిగిపోయాయి. ఎన్టీపీసీలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


ఓదెల: గుండ్లపల్లిలో లేచిపోయిన ఇంటి కప్ప రేకులు


జ్యోతినగర్ : ఎన్టీపీసీలో రోడ్డుపై పడిపోయిన చెట్టు

ముందుకు సాగని రోడ్డు పనులు

కుమ్మరికుంట-ఖిలావనపర్తి మధ్య కంకర తేలిన రోడ్డు

- బీఆర్‌ఎస్ సర్కార్ రూ. 3.50 కోట్లు మంజూరు
- రెండున్నరేళ్ల నుంచి నిలిచిన పనులు
- ప్రయాణికుల ఇబ్బందులు

జూలపల్లి, జూన్4: మండలంలోని కుమ్మరికుంట నుంచి ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామాల మధ్య చేపట్టిన రోడ్డు పనులను కాంట్రాక్టర్ పూర్తి చేయడం లేదు. రెండున్నరేళ్లు గడుస్తున్నా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ పనులు ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. కాంట్రాక్టర్ మట్టి రోడ్డు చదును చేసి మొరం, కంకర వేసి తొక్కించి మిగతా పనులు వదిలేశాడు. బీఆర్‌ఎస్ సర్కార్ మట్టి రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి పీఎంజీఎస్‌వై నుంచి రూ. మూడున్నర కోట్లు మంజూరు చేసింది. 20 జనవరి 2022న అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్, అప్పటి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు పనులు పూర్తి చేయించకపోవడంతో నిరసన వ్యక్తమవుతున్నది. కంకర తేలిన రహదారిపై ద్విచక్ర వాహనాలు నడప లేక ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డుపై వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. వాహనాల రాకపోకలకు కంకర ఎగిరిపడి పాదాచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే రహదారి పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.